క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

రంగంపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రెండు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సీడీపీఓ జె.జెస్సీఫ్లోరెన్స్ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. రంగంపేట మండలం చంద్రేడు-1 కేంద్రంలో సహాయకురాలు (బీసీ-బి), బిక్కవోలు మండలం కాపవరం-2 కేంద్రంలో కార్యకర్త (ఓసీ), మినీ కార్యకర్త (ఓసీ), సహాయకురాలు (ఓసీ) పోస్టులను భర్తీ చేయనున్నారు. దీనికిగాను ఈ నెల 31వ తేదీ లోగా ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని అధికారులు తెలిపారు.

ఆయా పోస్టులకు..

అనపర్తి: మండలంలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ రాయవరం సీడీపీఓ వరాహలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లక్ష్మీనరసాపురం-1 కేంద్రం (ఎస్సీ), మహేంద్రవాడ-3 కేంద్రం (ఓసీ)కి రిజర్వు అయ్యాయన్నారు. అభ్యర్థినుల వయసు 2023 జూలై 1 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా పూర్తి చేసిన దరఖాస్తులు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు. మిగిలిన వివరాలకు రాయవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు 9 మంది గైర్హాజరు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం లెక్కలు పేపర్-2బీ, జువాలజీ పేపర్-2, హిస్టరీ పేపర్-2 పరీక్షలు శుక్రవారం జరిగాయి. జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రానికి 162 మంది హాజరు కావాల్సి ఉండగా 158 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 171 మందికి 166 మంది హాజరయ్యారు. మొత్తం 9 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు కేవీ రామకృష్ణ, సీహెచ్ఏ శిరీష తెలిపారు.

వేలం ఖరారు

మధురపూడి: కోరుకొండ పంచాయతీ పరిధిలో ఆశీలు, కబేళా నిర్వహణకు శుక్రవారం బహిరంగ వేలం ప్రశాంతంగా జరిగింది. గ్రామంలోని ఆశీలు వసూలును రూ.4,16,000కు వైఎస్సార్ సీపీ నాయకుడు మల్లిడి చంటిరెడ్డి పాడుకున్నారు. కబేళాను బాల సుబ్రహ్మణ్యం రూ.29 వేలకు దక్కించుకున్నారు. 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు వీరికి హక్కు లభించింది. నిర్వహణ అధికారిగా పంచాయతీ సెక్రటరీ కె.రమేష్ బాబు వ్యవహరించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ కర్రి లక్ష్మీ సరోజ, ఉప సర్పంచ్ నేతుల చిన్ని, ఎంపీటీసీ కాళ్ల వీరబాబు, సచివాలయం-2 సెక్రటరీ ఏ.గణపతి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


ఇరువర్గాల ఫిర్యాదులపై కేసులు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లకు చెందిన పాలడుగుల రామచంద్రరావును గురువారం రాత్రి గతంలో జరిగిన ఘర్షణలను దృష్టిలో ఉంచుకుని రుద్రం వెంకట్రావుతో పాటుగా మరో ఐదుగురు కొట్టినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై కె.శుభశేఖర్ శుక్రవారం తెలిపారు. అలాగే రుద్రం వెంకట్రావును పాలడుగుల రామచంద్రరావు కొట్టినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

క్రీస్తు బోధనలతో మానవాళికి మేలు

మధురపూడి: క్రీస్తు బోధనలను అనుసరించడం ద్వారా మానవాళికి మేలు జరుగుతుందని ఫాదర్ బత్తుల జయరాజు అన్నారు. కోరుకొండ ఎస్సార్ నగర్, సీతానగరం మండలం కూనవరం ఆర్‌సీఎం చర్చిల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శ్రమల కాలంలో క్రైస్తవులు ఉపవాస దీక్షలతో పాటు, దానధర్మాలు చేయాలన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పవిత్ర ఆంథోని, జోసఫ్ తంబీ పాల్గొన్నారు.

అమ్మవారికి అభిషేకాలు



అమ్మవారికి అభిషేకం చేయడానికి బిందెలతో వచ్చిన మహిళలు

సీతానగరం: గ్రామంలోని సంతలో ముసలమ్మ జాతర మహోత్సవం సందర్భంగా శుక్రవారం మహిళలు పసుపు నీటితో అమ్మవారికి అభిషేకాలు చేశారు. ఈనెల 18 నుంచి 25 వరకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహోత్సవాలు జరుగుతాయి. 26న అన్నసమారాధన నిర్వహిస్తారు.

రేపు రక్తదాన శిబిరం

రాజానగరం: స్థానిక శ్రీలక్ష్మీ గణపతి గూడ్స్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రాజానగరంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. రావులచెరువు గట్టున ఉన్న ఆటోస్టాండ్ వద్ద ఉదయం 9 నుంచి ఈ శిబిరం ప్రారంభమవుతుంది. తలసేమియా వ్యాధితో బాధపడే పిల్లలకు అవసరమైన రక్తం సకాలంలో అందక ప్రాణాలు కూడా పోతుంటాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని వారి కోసం ఈ శిబిరాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులలో ఒకరైన జనపరెడ్డి ప్రసాద్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 87904 29833ను సంప్రదించాలని కోరారు.

పొరదోలుదోమా..

- సుడిదోమతో పంటలకు నష్టం
- సస్యరక్షణ చర్యలు అవసరం
- క్లస్టర్‌లో 57,442 ఎకరాల్లో సాగు

పెదపూడి: దోమ చిన్నదే.. అది పంటలకు తెచ్చే నష్టం అపారం. రబీ వరి పంటపై దోమపోటు ఉంటే సకాలంలో సస్యరక్షణ చర్యలు అవసరం.. లేకుంటే పంట దెబ్బతినే ప్రమాదం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో 57,442 ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. అనపర్తి మండలంలో 12 వేలు, పెదపూడిలో 18 వేలు, రంగంపేటలో రెండు వేలు, బిక్కవోలులో 13 వేలు, కోరుకొండలో 2,465, సీతానగరంలో 1,917 ఎకరాలు, రాజానగరం మండలాల్లో 8,060 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అన్ని ప్రాంతాల్లోని వరి పంటపై గోధుమ రంగు దోమ, తెల్లమచ్చ దోమ నారుమడి ప్రారంభం నుంచి ఉంటాయి. అలాగే వరి పంట పిలక దశలో అరుదుగా, పొట్టదశ, ఈనిక దశలలో ఎక్కువగా ఉంటుంది. పిల్ల, పెద్ద దోమలు నీటిమట్టంపై ఉండి దుబ్బుల నుంచి రసం పీల్చడం ద్వారా నష్టాన్ని కలుగజేస్తాయి. ప్రధానంగా దీనిని సుడిదోమ లేక దోమపోటుగా పిలుస్తారు.



సుడిమచ్చ తెగులు సోకిన పొలం (ఫైల్)



దుబ్బు మొదళ్లలో గోధుమ, తెల్ల దోమలు

ఉధృతి ఎక్కువైతే..

వరి పంటలో దోమ పోటు ఉధృతి ఎక్కువైతే పొలం ఎండిపోయి వాలిపోతుంది. తాలుగింజలు ఏర్పడతాయి. పంట నూర్చినప్పుడు గింజలు నూకగా మారతాయి. సుడిదోమతో గ్రాసిస్టంట్ అనే వైరస్ తెగులు కూడా రావడానికి అవకాశం ఉంది. ఉధృతి ఎక్కువగా ఉన్నపుడు పొలంలో ఉన్న నీటిని గమనిస్తే సుడిదోమ తెట్టులా తేలియాడుతూ కనిపిస్తుంది. గోధుమ లేదా తెలుపు రంగు, లేదా బుడిద రంగులో వీపుపై తెల్లమచ్చ దోమలు నీటిమట్టానికి పైభాగాన దుబ్బుపై రెండు రూపాలలో (రెక్కలు ఉన్నవి, రెక్కలు అభివృద్ధి చెందనవి) కనిపిస్తాయి. ఈ దోమలు తొలి దశలో రసాన్ని పీల్చడంతో పైరు లేత పసుపు వర్ణానికి మారుతుంది. ఉధృతి పెరిగే కొద్దీ పైరు సుడులుగా వలయాకారంగా ఎండిపోతుంది. నత్రజనిని అధిక మోతాదులో వాడినప్పుడు, కాలిబాటలు తీయని పొలాల్లో పైరు తొలిదశలో ఆకులను ఆశించే పురుగుల నివారణకు క్లోరిపైరిపాస్ లేదా, ఫోపెనోఫాస్ లేదా సిథటిక్ పైర థ్రాయిడ్ మందులను వాడినప్పుడు ఈ పురుగు ఉధృతి ఎక్కువ అవుతుంది.

ఏం చేయాలంటే..

పిలకల దశలో దుబ్బుకు పది దోమలు, ఈనిక దశలో దుబ్బుకు 20 నుంచి 25 దోమలు గమనించిన వెంటనే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. దోమలను తట్టుకునే వరి రకాలైన కృష్ణవేణి, దీప్తి, ఇంద్ర, అమర, భావపురి సన్నాలు, శ్రీధృతి వంటి రకాలు సాగు చేసుకోవాలి. పొలాన్ని అడపదడపా ఆరబెట్టాలి. వరి నాటేటప్పుడు ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్లకు బాటలు తీయాలి. దీని నివారణకు లీటర్ నీటికి ఎసిఫేట్ 1.5 గ్రాములు, లేదా మోనో క్రోటోఫాస్ 2.2 మిల్లీలీటర్లు, లేదా ఇథోఫెనోప్రాస్ రెండు మిల్లీలీటర్లు, లేదా ఫెనో బుకార్బ్ 2 మిల్లీలీటర్లు, ఇమిడాక్లోప్రిడ్ 0.25 మిల్లీమీటర్లు, థైయోమిథాక్సామ్ 0.2 గ్రాములు, లేదా బుప్రోఫెజ్రీజిన్ 1.6 మిల్లీలీటర్లు, లేదా పైమెట్రోజైన్ 0.6 గ్రాములు, లేదా ట్రిఫ్లూమిజోపైరిమ్ 0.486 మిల్లీ లీటర్లు, లేదా డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రాములు, లేదా ఇమిడాక్లోప్రిడ్, ఎథిప్రోల్ 0.25 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేయడంతో దోమపోటు తగ్గుతుంది.

అప్రమత్తత అవసరం



రబీ పంట ఈనిక, ఈనిక పూర్తవుతున్న దశల్లో ఉన్న నేపథ్యంలో పంటకు సుడి లేక దోమపోటు వరి పంటకు ఉంటుంది. రైతులు అప్రమత్తంగా ఉండి ఏ కొంచెం దోమపోటు కనిపించినా వెంటనే వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలపై సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపట్టాలి.

– టీవీఆర్ మణిదీప్, మండల వ్యవసాయ అధికారి, పెదపూడి

మంచి ఉత్తీర్ణత సాధించాలి



దొడ్డిగుంట హైస్కూల్ హెచ్‌ఎం ఇందిరా ప్రియదర్శినిని సత్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రంగంపేట: దొడ్డిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు, కార్యదర్శి కె.నాని, అపురూప్ మాట్లాడుతూ వచ్చే నెలలో ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులంతా మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. తద్వారా పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ముఖ్యంగా బాలికలు పదో తరగతి తరువాత చదువు ఆపేయకుండా ఉన్నత చదువులు చదువుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం ఇందిరా ప్రియదర్శినిని సత్కరించారు. ఎస్ఎఫ్ఐ సభ్యులు సాగర్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో క్షయ నివారణ

అనపర్తి: సమష్టి కృషితో క్షయ వ్యాధి నివారణ సాధ్యమని ఎంఎల్‌హెచ్‌పీ జాస్మిన్ అన్నారు. క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా మహేంద్రవాడలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కుతుకులూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మాట్లాడుతూ క్షయను నిర్లక్ష్యం చేయకుండా సరైన సమయంలో మందులు తీసుకోవటం ద్వారా వ్యాధిని నయం చేసుకోవచ్చని అన్నారు. అనంతరం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు.

క్షయ నిర్మూలనకు కృషి

రంగంపేట: క్షయ నిర్మూలనకు అంతా సమష్టిగా కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి అన్నారు. స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్షయ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. సమావేశం అనంతరం ర్యాలీని ప్రారంభించారు. మర్రిపూడి, జి.దొంతమూరు, చంద్రేడు తదితర గ్రామాల్లో ఆయా సర్పంచులు వేము మాధవి, గోలి రమణ, జాస్తి వెంకటపద్మావతి ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది క్షయపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించారు.

- బిక్కవోలులో పీహెచ్‌సీ వైద్యాధికారి డి.రాజీవ్ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. గ్రాసీం ఇండస్ట్రీస్ బలభద్రపురం వారి సౌజన్యంతో 20 మంది క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లు అందించారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.



సీతానగరంలో ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది



రంగంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

పెదపూడి: స్థానిక సీహెచ్‌సీ వద్ద సూపరింటెండెంట్ సుజాత, పెద్దాడ, సంపర పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు సురేఖ, సంతోష్, శ్యామల ఆధ్వర్యాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ క్షయ అంటువ్యాధి కాదన్నారు. హెచ్ఈ సరోజిని, సుకుమార్, సూపర్‌వైజర్లు శ్రీనివాసు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం పీహెచ్‌సీలో శుక్రవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.రాజు ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాధాకృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

గోకవరం: టీబీ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి ఎస్‌టీఎస్ వి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే టీబీ నివారణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎమ్ చిమ్మరాజుదొర, వైద్య సిబ్బంది పవన్, రమణ, నాగలక్ష్మి సూర్యకాంతం తదితరులు పాల్గొన్నారు.



పెదపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న సుజాత తదితరులు

నూరు శాతం పన్నుల వసూలు

పెదపూడి: మండలంలోని 18 గ్రామాలకు గాను 16 చోట్ల నూరు శాతం పన్నులు వసూలు చేయడం అభినందనీయమని ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డిని కాకినాడ డీఎల్‌పీఓ వై.అమ్మాజీ ప్రశంసించారు. సంపరలో పన్ను వసూళ్ల ప్రత్యేక డ్రైవ్‌ను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మాజీ మాట్లాడుతూ మండలంలో రూ.1.36 కోట్ల పన్నులు వసూలు చేయాల్సి ఉండగా రూ.1.17 కోట్లు వసూలు చేశారన్నారు. మొత్తం 85.64 శాతం పూర్తయిందన్నారు. 16 గ్రామ పంచాయతీల్లో నూరు శాతం పూర్తవ్వగా మిగిలిన జి.మామిడాడ, సంపర గ్రామాల్లో వేగవంతం చేశారన్నారు. అనంతరం గ్రామంలో పన్నులు వసూళ్లు పూర్తి చేసిన కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించారు. పారిశుధ్యం మెరుగుపర్చాలని, కుక్కలను నియంత్రించాలని, పగటి సమయంలో వీధిదీపాలు వెలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యదర్శులు యాళ్ల ఉమామహేశ్వరరావు, జి.త్రినాథ్, బి.ప్రసన్న కుమార్, ఎస్‌వీ స్వామి, శిరీష, తరుణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



సంపరలో సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ అమ్మాజీ

వైద్య సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారాలు

గోకవరం: కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్య సిబ్బందికి జిల్లా ఉత్తమ సేవా పురస్కారాలు అందాయి. మండలంలో టీబీ వ్యాధిగ్రస్తులకు సేవలు అందించినందుకు ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, హెల్త్ అసిస్టెంట్ జి.పవన్‌కుమార్‌కు పురస్కారాలు దక్కాయి. శుక్రవారం రాజమహేంద్రవరంలో జరిగిన టీబీ నివారణా దినోత్సవం కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ, జిల్లా టీబీ అధికారి డాక్టర్ వసుంధర చేతుల మీదుగా ఈ పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ రవీంద్ర, ఎస్‌టీఎస్ వి.శ్రీనివాస్, ఇతర వైద్య సిబ్బంది, అధికారులు అభినందనలు తెలిపారు.



ఉత్తమ సేవా పురస్కారాలు అందుకుంటున్న ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, హెల్త్ అసిస్టెంట్ పవన్‌కుమార్

మీటర్ చిత్రబృందం సందడి



ఐఎస్‌టీఎస్ కాలేజీలో హీరో కిరణ్ అబ్బవరం

రాజానగరం: తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో మీటర్ చిత్ర బృందం శుక్రవారం సందడి చేసింది. కిరణ్ అబ్బవరం హీరోగా రమేష్ కాదూరి దర్శకత్వంలో ఈ సినిమా రూపొందించారు. ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం విద్యార్థినులతో మాట్లాడారు. ఆ చిత్రంలోని పాటలకు అనుగుణంగా డ్యాన్స్ చేసి ఉత్సాహం నింపారు. కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రమని, వినోదానికి అధిక ప్రాధాన్యత ఉంటుందని, ప్రతి ఒక్కరూ థియేటర్‌లో ఈ సినిమాను చూసి ఆదరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు

మధురపూడి: కోరుకొండ మోతీ మసీదులో శుక్రవారం రంజాన్ ప్రార్థనలు జరిగాయి. ఉదయం 4.43 గంటలకు సహరీతో ప్రారంభమైన ఉపవాస దీక్ష సాయంత్రం 6.23 గంటలకు ఇఫ్తార్‌తో మొదటి రోజు ముగిసింది. మసీదులో గురువు షేక్ సయ్యద్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. ఎస్‌కే సుభాన్ సాహెబ్, బాషా, వక్ఫ్ బోర్డు సభ్యుడు ఎస్‌కే బిజిలానీ పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి వితరణ



పరీక్షా సామగ్రితో పదో తరగతి విద్యార్థులు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్ యూత్ సర్కిల్ వీటిని అందజేశారు. స్కూల్ ఫేర్‌వెల్ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు పరీక్షలు రాయడానికి అనువైన పరీక్ష అట్టలు, పెన్నులు, బాక్సులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గంగా భవాని, వైఎస్సార్ సీపీ నాయకులు చాటపర్తి దుర్గారావు, సత్య సాయికుమార్, దుర్గాప్రసాద్, హరికృష్ణ పాల్గొన్నారు.

రైతుల సాధక బాధకాల ప్రస్తావన



డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు విషయంలో రైతుల సాధక బాధకాలను అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం శాసనసభలో ప్రస్తావించారు. శుక్రవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు కలుగుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. పెదపూడి మండలంలోని రైతు భరోసా కేంద్రంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని పెదపూడి సమీపంలో బిక్కవోలు, అనపర్తి రైస్ మిల్లులకు రవాణా చేయడం వల్ల ప్రభుత్వానికి, రైతుకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. జగనన్న శాశ్వత భూహక్కు పథకంలో రైతుల ఎంజాయ్మెంట్ ప్రకారం భూ సర్వే నిర్వహిస్తున్నారని, అయితే డాక్యుమెంట్లను కూడా పూర్తిగా పరిశీలించడంతో పాటు సరిహద్దు రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనపర్తి సామాజిక ఆరోగ్య కేంద్రం స్థాయి పెంపుదల విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన సీఎం జగన్ సీహెచ్‌సీని 100 పడకల ఆసుపత్రిగా (ఏరియా ఆసుపత్రి) అప్‌గ్రేడ్ చేయడం పట్ల ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పర్యాటక రంగం అభివృద్ధికి చర్యలు

కడియం: కడియపులంక ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పర్యాటకశాఖ రీజినల్ డైరెక్టర్ వి.స్వామినాయుడు అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా అధికారులతో కలిసి కడియపులంకలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడియం మండలంలో విస్తరించి ఉన్న నర్సరీలు, చేనేత, ధవళేశ్వరం బ్యారేజీ, పిచ్చుకలలంక, లొల్ల లాకులు తదితర ప్రాంతాల్లో సందర్శకులు పర్యటించేందుకు ఆసక్తి చూపుతారన్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాలను కలుపుకొని పర్యాటకులను ఆకర్షించే విధంగా చర్యలు చేపట్టనున్నామన్నారు. అందుకు అనువుగా స్థానికంగా ఉండే మౌలిక వసతులను కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కడియపులంకలో మధ్యలోనే నిలిచిపోయిన భవనాన్ని, పంపింగ్ స్కీమ్ కాలువలను పరిశీలించారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ మార్గాని అమ్మాణీ కోరారు. అంతకు ముందుగా పంచాయతీ పాలకవర్గంతో డైరెక్టర్ స్వామినాయుడు సమావేశమయ్యారు. జిల్లా అధికారి పి. వెంకటాచలం, సర్పంచ్ మార్గాని అమ్మాణీ, ఉప సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, స్థానిక నాయకులు మార్గాని ఏడుకొండలు, బోడపాటి మూర్తి, సోడసాని దుర్గారావు, పంచాయతీ కార్యదర్శులు జయరాజు, వెంకటలక్ష్మీదేవి పాల్గొన్నారు.



కడియపులంకలో పర్యటిస్తున్న టూరిజం రీజినల్ డైరెక్టర్ స్వామినాయుడు

గాడాల అంగన్‌వాడీ కేంద్రం-1 టీచర్‌గా ధనలక్ష్మి

మధురపూడి: కోరుకొండ మండలం గాడాలలోని అంగన్‌వాడీ కేంద్రం-1 టీచర్‌గా కొల్లి ధనలక్ష్మి ఎంపికయ్యారు. ఆమె అదే కేంద్రంలో హెల్పర్‌గా పని చేస్తూ టీచర్‌గా నియమితులయ్యారు. ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన టీచర్ రిటైర్ కావడంతో పోస్టు ఖాళీ అయ్యింది. దీనికి ఐసీడీఎస్ అధికారులు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ధనలక్ష్మి ప్రతిభ చూపింది. ఆమెకు రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ ఝాన్సీరాణి, వైఎస్సార్ సీపీ నాయకుడు చాటపర్తి దుర్గారావు పాల్గొన్నారు.



ధనలక్ష్మికి నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ శాంతి

రామచంద్రపురం రూరల్: వెల్ల గ్రామంలో సచివాలయాలను రామచంద్రపురం డీఎల్‌డీఓ ఎ.శాంతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల హాజరు పట్టీని పరిశీలించి అందరూ హాజరైనట్లు గుర్తించారు. ఈ సందర్భంగా వారికి ఆమె పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ కార్యాలయ పని వేళల్లో విధిగా హాజరు కావాలని, ఒకవేళ పనిపై బయటకు వెళ్లాల్సి వస్తే మూమెంట్ రిజిస్టర్‌లో సమయం నమోదు చేయాలన్నారు. ప్రజలతో స్నేహంగా ఉంటూ వారికి అవసరమైన పనులను సకాలంలో పూర్తి చేసి సచివాలయాలకు మంచి పేరు తీసుకుని రావాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు రాయుడు మోహన్, ఎండీ శ్వేత్లానా, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన విగ్రహాలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కడియం: మాధవరాయుడుపాలెంలో ఈనెల 27న ప్రతిష్ఠించనున్న భువనేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామితో పాటు మొత్తం 18 నూతన విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా రెండోరోజైన గురువారం నిత్య పూజల అనంతరం ప్రతిష్ఠామూర్తులు, యంత్రములకు క్షీరాధివాసం, ధాన్యాధివాసం చేశారు. అఖండ శివనామ సంకీర్తనలు జరిగాయి. ఫ్రీడమ్ చాటర్ కంపెనీ సీఈవో అన్నందేవుల మణీంద్ర, ప్రేమ దంపతులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

రామచంద్రపురం: స్థానిక రత్నంపేట మున్సిపల్ హైస్కూల్ నుంచి 10 మంది విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ (ఎన్ఎంఎంఎస్) స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం విత్తనాల సుబ్బారావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. విద్యార్థులు పి.దీపక్ సతీష్, పి.చిట్టి లక్ష్మీనారాయణి, సీహెచ్ తనీష్, పి.గణేష్, ఐ.ఆనంద్, పి. హరి ప్రవీణ్, కె.దివ్య మధుభారతి, సీహెచ్ కీర్తి, వి.జ్యోత్స్న, టి.సాహితి ఎంపియ్యారు. వీరికి ఏడాదికి రూ. 12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు రూ. 48 వేలు స్కాలర్‌షిప్పుగా అందిస్తారని తెలిపారు.

రాయవరం: ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు అర్హత సాధించారు. రాయవరం మండలం నుంచి ఎనిమిది మంది విద్యార్థులు అర్హత పొందారు. మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి తమలంపూడి సంపత్‌రెడ్డి, ఒగ్గు కుశ్వంత్‌సాయి, అమలదాసు పావని, సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి శాకా నాగరమ్య, వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బోనం వెంకటభాస్కర్ శ్రీరామ్, గొడుగు రమ్యశ్రీ, పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ద్వారంపూడి మధుసూదన శివశ్యామ్, కొవ్వూరి వెంకటలక్ష్మి అర్హత సాధించినట్లు హెచ్‌ఎంలు పి.జగన్మోహిణి, రాయి దమయంతి, ఎం.అంబేద్కర్, వి.శాంతిసునీత తెలిపారు. వీరి వ్యక్తిగత అర్హతలను సంబంధిత హెచ్‌ఎంలు ధ్రువీకరించాల్సి ఉంది.